## క్లుప్తంగా

### నేడు గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



గుడివాడటౌన్: స్థానిక 6వ వార్డు, ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ విజయ గణపతి దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నారు. ది ఫిషర్‌మెన్ సొసైటీ యూత్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగనుంది. ఇందులో భాగంగా మంగళవారం శాంతి నిమిత్తం స్వామి వారి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిఖర, కలశ, సహితాంగ, శ్రీ విజయ గణపతి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. ప్రతిష్ఠా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి అభిషేకాలు చేశారు.

### ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



మండవల్లి: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నవీన్ పేర్కొన్నారు. మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో రూ.2.06 లక్షలతో చేపట్టిన పంట బోదె పనులను మంగళవారం ఉపాధి కూలీలు నిర్వహించారన్నారు. 107 మంది కూలీలు పనులు చేశారని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జరిగిన స్వామివారి అభిషేకాలకు భక్తులు వెల్లువెత్తారు. ప్రతి మంగళవారం జిల్లాలోని నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అభిషేకాలు చేయించుకుంటారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయకమిషనర్ ఎస్ సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

### 4 నుంచి అమృతేశ్వరుని కల్యాణోత్సవాలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని సింగరాయపాలెం గంగాపార్వతీ సమేత శ్రీఅమృతేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కంతేటి వరలక్ష్మి, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 4న స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 5న స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 6న రథోత్సవం, 7న పవళింపుసేవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

### ఉమ్మడి రహదారి, హద్దులపై విచారణ

పెడన: 20వ వార్డులో రైల్వేగేటు పక్కన స్థల వివాదంపై మంగళవారం అధికారులు విచారణ చేశారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారికి నడిచి వెళ్లేందుకు గతంలో ఉన్న మార్గం ప్రస్తుతం లేదని స్పందనలో ఫిర్యాదు చేశారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు ర్యాంకు ఉద్యోగితో పాటు మచిలీపట్నం ఆర్డీఓ ఐ.కిషోర్, తహసీల్దార్ పి.మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తదితరులు మూసివేసిన మార్గం వద్ద మంగళవారం విచారణ చేశారు. బాధితులు మాట్లాడుతూ.. రైల్వే స్థలానికి అనుకుని ఉన్న తన సొంత స్థలంలో కూర్మ హిమగిరిరావు నిర్మాణం చేపట్టారన్నారు. అదే సమయంలో రైల్వే వారు డబ్లింగ్ పనులు చేపట్టడంతో రైల్వే స్థలంలో ఉన్న రోడ్డు మార్గం పూర్తిగా మూతపడిందని చెప్పారు. రైల్వే వారు ట్రాక్ పక్కన నడిచేందుకు కొంత జాగా ఉన్నా ఎటువంటి ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో స్తంభాలు వేసి ఆ మార్గాన్ని పూర్తిస్థాయిలో మూసివేశారన్నా. దీంతో ట్రాక్ పక్కనే నివాసం ఉంటున్న వారు మాకు రోడ్డు మార్గం లేదని, గతంలో ఉన్న దానిని మూసివేశారంటూ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలు దఫాలుగా చర్చలు జరిపిన అధికారులు మంగళవారం తుది దశకు తీసుకువచ్చారు. కూర్మా హిమగిరిరావు రెండు అడుగుల స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడంతో వెనుక ఉండే వారికి నడకదారికి అవకాశం కల్పించారు. దీంతో అధికారులు, నివాసితులు హిమగిరిరావును అభినందించారు. ఆర్ఐ మణికుమార్, సర్వేయర్ కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఉత్తమ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి గీతాబాయి



కనుమూరులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

పెదమద్దాలి(పామర్రు): ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్(ఎఫ్‌పీసీ) అని అత్యంత పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఉత్తమ వైద్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. మండలంలోని కనుమూరు పీహెచ్‌సీ పరిధిలో గల పెద్దమద్దాలి గ్రామంలో మంగళవారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి ప్రజలతో ఆమె మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన పరీక్షలు జరిపించాలని, నెలకు సరిపడా మందులను ఇవ్వాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

**ప్రజలకు ముందుగానే తెలపాలి..**

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జీవన శైలి జబ్బుల బాధితులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించే తేదీలను ముందుగానే వెల్లడించాలని చెప్పారు. ఆయా తేదీల్లో గ్రామానికి డాక్టర్లు వస్తున్నట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. దీని వలన ప్రజలు వైద్య సేవలు పొందగలుగుతారని చెప్పారు. ఎఫ్‌పీసీని మెరుగ్గా ముందుకు తీసుకెళ్లేలా సమర్థులైన అధికారులు సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

**రక్తహీనత నివారణ, నేత్ర పరీక్షలు**

గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనత సమస్యను ఎదుర్కోవాలని డీఎంహెచ్‌వో గీతాబాయి తెలిపారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ఈమేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులను గుర్తించి తప్పని సరిగా పౌష్టికాహారం అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విలేజ్ క్లినిక్ స్థాయిలోనే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. ఈ మేరకు కంటి డాక్టర్లకు షెడ్యూల్ రూపొందించి, నెల, రెండు నెలలకు ఒకసారి నేత్ర పరీక్షలను చేయాలన్నారు. కంటి సంబంధిత సమస్యలున్న వారికి కంటి అద్దాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్, సీహెచ్‌వో బి.ఉదయ్‌కిరణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం రాణి, 104 వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రుద్రపాక జెడ్పీ హైస్కూల్‌లో అ‘పూర్వ’ సమ్మేళనం



విద్యనేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గుడివాడటౌన్: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మంగళవారం జరిగింది. నందివాడ మండలం రుద్రపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1983–88 పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. 35 ఏళ్ల విరామం అనంతరం తిరిగి విద్యార్థులంతా ఒక్కచోట చేరి వారికి విద్యను నేర్పిన గురువులను సత్కరించడంతో పాటు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుత్తా రమేష్, కె.సత్యనారాయణ, టి.జగన్‌మోహనరావు, పి.శేషగిరిరావు, చైతన్య ప్రభులతో పాటు సహచర విద్యార్థిని, విద్యనభ్యసించి ప్రజాసేవకు అంకితమైన సోషల్ వర్కర్ గూడపాటి నిర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పి.మురళి, పి.సుధాకర్, టి.శ్రీను, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, పి.ఉమ, పి.జ్యోత్స్న పాల్గొన్నారు.

## అలరించిన భామాకలాపం నృత్య రూపకం



నృత్యం చేస్తున్న కళాకారులు

ఎలకుర్రు(పామర్రు): భ్రమరాంబ సమేత చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా రెండో రోజైన మంగళవారం రాత్రి నిర్వహించిన భామాకలాపం నృత్య రూపకం ఆహుతులను అలరించింది. ఈ భామాకలాపంలో సత్యభామగా పసుమర్తి శ్రీనివాస్ శర్మ తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించారు. మాధవునిగా పసుమర్తి వెంకటేశ్వరశర్మ నృత్యం చేశారు. నట్టువాంగం వేదాంతం రాధేశ్యామ్ సహకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ హరిదాసులు నాగమల్లేశ్వరి, సత్యనారాయణ భాగవతార్ల హరికథలు ఆలయంలో నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు కళాకారులను సత్కరించారు.

## రూ.10 వేల కోట్ల వ్యాపార లక్ష్యం

- సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం బ్రహ్మయ్య
- 5న నాగాయలంకలో నూతన బ్రాంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్ఎం బ్రహ్మయ్య, శ్రీనివాస్ తదితరులు

నాగాయలంక: సప్తగిరి గ్రామీణ బ్యాంకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల వ్యాపార లక్ష్యంతో అన్ని రంగాలకు విస్తృత బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ముందడుగు వేస్తోందని బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం నాగాయలంకలో పర్యటించిన ఆయన నూతన బ్రాంచ్ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన స్థానిక దీనదయాళపురం రోడ్డులోని ఏబీఐ ఎదురు కాంప్లెక్స్‌లో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ చేతుల మీదుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. కృష్ణా జిల్లాలో 95 బ్రాంచ్‌ల్లో ఇప్పటికే రూ.ఆరు వేల కోట్ల వ్యాపారం సాగిస్తోందన్నారు. గోల్డ్ లోన్స్, రైతు రుణాలు, చేపలు, రొయ్యల చెరువుల సంబంధిత రుణాలు, విద్యా రుణాలు, గృహ రుణాలు అందించడంతో పాటు వాణిజ్య బ్యాంకులలో లభ్యమయ్యే అన్ని సేవలు ఉంటాయని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయని, ఐదోవదిగా నాగాయలంక, త్వరలో ఆరవదిగా కోడూరులో బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆర్ఎం ఆఫీస్ చీఫ్ మేనేజర్ రాజా శ్రీనివాస్, బ్రాంచి మేనేజర్ బీజే విఠల్ విహారి, క్యాషియర్ కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన సేవలు



తామరకొల్లు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సూపర్‌వైజర్ లావణ్య

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను ప్రభుత్వం అందిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. తామరకొల్లు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను మంగళవారం పంపిణీ చేశారు. లావణ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చారన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు చక్కటి పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ హేమ, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, నిర్మల, గుణసుందరి, సచివాలయ ఎంఎస్‌కే పద్మజ, మాధవి, సచివాలయ సెక్రటరీ జీవన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

## గుడివాడలో భారీ వర్షం



రహదారిపై నిలిచిన వర్షం నీరు

గుడివాడటౌన్: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు రంగంలోకి దిగి పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తరలించేందుకు సిబ్బందితో చర్యలు చేపట్టారు.

## వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి కె.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం వైశాఖ మాసం శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని స్వామి వార్ల కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం స్వామి వార్లకు విశేషంగా అభిషేకాలను నిర్వహించి, తదుపరి స్వామివార్లను పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరిస్తామని చెప్పారు. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి ఆలయంలో వేద మంత్రాలతో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకున్నామన్నారు. శుక్రవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పామర్రు: పామర్రు టౌన్‌లో బుధవారం ఉదయం పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది మంగళవారం తెలిపారు. అనంతరం పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

## చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలి

నాగాయలంక: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలని డివిజినల్ అభివృద్ధి అధికారులు బి.సుబ్బారావు (గుడివాడ), కె.పద్మ (మచిలీపట్నం) అన్నారు. సచివాలయాల సేవలపై నాగాయలంక, కోడూరు మండలాల సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సకాలంలో సిబ్బంది హాజరు, ప్రోగ్రామ్‌లు, పథకాల అమలు విధానం, స్పందన, సర్వే తదితర అంశాలను వివరించారు. ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోడూరు ఎంపీడీఓ ఆకుల పాండురంగారావు, తహసీల్దార్లు జె.విమల కుమారి (నాగాయలంక), లతీఫ్ (కోడూరు), పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

### 5న భావనారుషి దేవాలయ ప్రతిష్ఠ

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం (పద్మశాలిపేట)లో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని నడకుదురు వద్ద కృష్ణానదిలో ప్రతిష్ఠా మూర్తులకు జలాధివాస మహోత్సవం జరిగింది. రేవు నుంచి ప్రతిష్ఠా మూర్తులను చల్లపల్లి మీదుగా భారీ ఊరేగింపుతో నూతన ఆలయానికి తీసుకువచ్చారు. ప్రధాన కూడలిలో యువకులు డప్పు వాయిద్యాలతో సందడి చేస్తూ, జయజయ ధ్వానాల నడుమ ప్రతిష్ఠామూర్తులను ఆలయానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 10.49 గంటలకు నూతన ఆలయంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

### ఐదు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై కల్యాణమూర్తులను లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి గ్రామంలో ఊరేగించారు. ఉదయం గోకర్ణేశ్వర స్వామి వారి లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం వద్ద ఐదు వేల మందికి అన్నసమారాధన చేశారు. నక్కవానిదారి, లింగారెడ్డిపాలెం, మందపాకల, కోడూరు, జరుగువానిపాలెం, పోటుమీద గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### అర్చకుడికి ఆర్థిక సాయం

గూడూరు: కప్పలదొడ్డి శివాలయంలో అర్చకత్వం చేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న కనకం పంతులుకు కప్పలదొడ్డి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు బి.ప్రభు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు రూ.11 వేలు, గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ పత్తిపాటి వీరబాబు రూ.2 వేలు వెరసి రూ.13 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు.

## మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి కైకలూరు సమస్యలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ

కైకలూరు: విద్యుత్, అటవీ పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తాడేపల్లి క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మంగళవారం కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు.

కైకలూరులో ఇద్దరు నేతలు మాట్లాడుతూ కొల్లేరు పరివాహక ప్రాంత గ్రామాల్లో ప్రజల ప్రయోజనార్థం అదనపు చెరువుల తవ్వకాలకు అనుమతులు అందించాలని కోరామన్నారు. కొల్లేరు గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని, పేదల భూముల పంపిణీకీ సహకరించాలని తెలిపామన్నారు. అనంతరం ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డనేటర్ మిథున్‌రెడ్డిని కలిసి ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఐదో స్థానంలో నిలవడంపై కై కలూరులో త్వరలో ఏర్పాటు చేయనున్న విజయోత్సవ సభకు హాజరు కావాలని ఆహ్వానించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు పాల్కొన్నారు.

## సీఎఫ్‌ఎంఎస్ ఐడీకి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గుడివాడ టౌన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్‌లు విధిగా తమ సీఎఫ్‌ఎంఎస్ ఐడీకి ఆధార్‌ను లింక్ చేయాలని సబ్ ట్రెజరర్ కార్యాలయ అధికారి కె.రాబర్ట్ మోహన్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్‌కు ఉద్యోగుల ఐడీ, పెన్షనర్ ఐడీ అనుసంధానం చేయాలని సూచించారు. పెన్షనర్‌లు ఇంకా ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయలేదని ఈనెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. పెన్షనర్‌ల సౌలభ్యం కొరకు ఈ–కేవైసీ పూర్తి చేయుటకు గుడివాడ సబ్ ట్రెజరర్ కార్యాలయ పరిధిలో వారి సిబ్బంది సేవాకేంద్రాలు మూడు మండల హెడ్ క్వార్టర్‌లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పెన్షనర్లు తమ అధార్ కార్డు, ఆధార్ అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను ఈ కేంద్రాలకు స్వయంగా గాని తమ ప్రతినిధుల ద్వారా గాని వచ్చి సీఎఫ్‌ఎంఎస్ ఐడీని అనుసంధానం చేసుకోవాలని సూచించారు. గుడివాడ, పెదపారుపూడి, ముదినేపల్లి, గుడ్లవల్లేరు, నందివాడ మండల పరిషత్ కార్యాలయాల్లోని ఉప ఖజానా కార్యాలయం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందిస్తామన్నారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఈకేవైసీ తప్పనిసరి..**

మొవ్వ: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ఫించన్‌దారులందరూ మే 10వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మొవ్వ ఉపఖజానా అధికారి టి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు తక్షణమే హెర్బ్ యాప్ సహకారంతో గానీ, ఉప ఖజానా కార్యాలయంలో నేరుగా సంప్రదించి సీఎఫ్‌ఎంఎస్ ఐడీకి ఆధార్ అనుసంధానం చేసిన మొబైల్ సహాయంతో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడివాడరూరల్: మండలంలోని గుంటాకోడూరు గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి ఏఈ డి.పృథ్వీ, ఎంపీటీసీ సభ్యుడు అంగడాల శ్రీరామాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని గుంటాకోడూరు గ్రామ సచివాలయంలో గ్రామంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇప్పటి వరకు లబ్ధిదారులు ఇంకా ఇళ్ల నిర్మాణాలను చేపట్టకపోతే వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.అనూల, సచివాలయ ఉద్యోగులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీమన్నారాయణుడి ఎదుర్కోలు ఉత్సవం

కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆలయ నిర్మాణ కర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నవకలశ స్నాపన ఉత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. అనంతరం శ్రీమన్నారాయణుడిని రాజకుమారుడిగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక పల్లకీలో దేవేరులను ఊరేగించుకుంటూ గ్రామంలోని రామాలయం వద్దకు తీసుకువెళ్లారు. స్వామివారి, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ ఎదుర్కోలు ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివార్లకు ప్రతి ఇంటి వద్ద హారతులు పడుతూ గ్రామస్తులు భక్తిభావం చాటారు. స్వామివారి 11 అడుగుల ఏకశిలా మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది.